క్లుప్తంగా

ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

మల్హర్: ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాల మేరకు 90 డేస్ యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేయడంతో మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్స్‌పాల్ విజయదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సహకరించిన అధ్యాపక బృందానికి, విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు సన్మానం



మల్హర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన రామిడి చాందిని, రామిడి అనూష, రామిడి సిరి చందనలను కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, మాజీ సర్పంచ్ అశోక్ రావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, ఇందారపు ప్రభాకర్, అర్ని ఉదయ్, రాగం రమేశ్ పాల్గొన్నారు.

'చర్య తీసుకోవాలి'

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో టీజీఎండీసీ ద్వారా నిర్వహిస్తున్న ఇసుక క్వారీల్లో అక్రమ వసూళ్లపై అధికారులు చర్య తీసుకోవాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమ వసూళ్లను అరికట్టి ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా చూడాలని డిమాండ్ చేశారు.

తాగునీటి కోసం నిరసన

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి శివారు కొత్తపల్లి కాలనీలో నీటి ఎద్దడి ఏర్పడి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఖాళీ బిందెలతో బోరింగ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. భగీరథ నీళ్లు రాక పోవడంతో కనీసం బోరు పని చేసిన కొంత మేర నీటిని వినియోగించుకునే వాళ్లమని, ప్రస్తుతం నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి వెంటనే నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బోరు మోటారు ఏర్పాటు

కాటారం: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడిబజార్ కమ్మరివాడలో బోరుబావి మోటార్ పనిచేయకపోవడంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. కాలనీవాసులు కొన్ని రోజులుగా నీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసుల ఇబ్బందులు మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్ దృష్టికి తీసుకు రావడంతో ఆయన మంగళవారం బోరుబావికి నూతన మోటార్ ఏర్పాటు చేయించారు. నీటి ఇబ్బంది తొలిగిపోవడంతో ఈ సందర్భంగా కాలనీవాసులు జనార్దన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మజీద్‌పల్లిలో విద్యుత్ కోతలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని మజీద్‌పల్లి వార్డులో మంగళవారం అప్రకటిత విద్యుత్ కోతలతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా లేక పోవడంతో చిన్నారులు, వృద్ధులు ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోయారు. సరస్వతి నది పుష్కరాల పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిచినట్లు ఎన్పీడీసీఎల్ అధికారులు పేర్కొంటున్నారు. కాగా, ఎలాంటి సమాచారం లేకుండా ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వేసవి కావడంతో ఉక్కపోత, ఎండ వేడికి ఇంట్లో ఉండలేని పరిస్థితులు ఉన్నట్లు మజీద్‌పల్లి వాసులు మొరపెట్టుకుంటున్నారు. ఎన్పీడీసీఎల్ అధికారులు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆర్థిక సాయం

రేగొండ: మండలంలోని రేపాకపల్లి గ్రామానికి చెందిన కాసం ఓదెలు మంగళవారం హత్యకు గురయ్యాడు. మృతుడు 108లో పైలెట్‌గా విధులు నిర్వహించేవాడు. దీంతో జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ తరుపున జిల్లా మేనేజర్ మేరుగు నరేశ్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా మేనేజర్ లక్ష్మణ్, జిల్లా మేనేజర్ చంద్రశేఖర్, సిబ్బంది దేవేందర్, కుమార్, శ్రీను, చంటి, రవి, మల్లారెడ్డి, స్వామి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



వాసురెడ్డి (ఫైల్)

భూపాలపల్లి రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మోరంచపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. మోరంచపల్లికి చెందిన బొడ్డిరెడ్డి వాసురెడ్డి (41) వ్యవసాయం, కుటుంబ అవసర నిమిత్తం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉరి వేసుకొని మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి సోదరుడు సందీప్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్ కుమార్‌తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



సుప్రియ (989) ఎంపీసీ



కె. వెన్నెల (987) బైపీసీ



రామిడి చాందిని (973) ఎంపీసీ



జి. రసగ్న (970) ఎంపీసీ



సౌమ్యశ్రీ (962) బైపీసీ



శిరీషా (962) బైపీసీ



వైష్ణవి (960) సీఈసీ



మేనం శ్రీజ (460) ఎంపీసీ



రామిడి సిరి చందన (456) ఎంపీసీ



రామిడి అనూష (456), ఎంపీసీ



అశ్విత (455) ఎంపీసీ

మల్హర్: రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో మండలంలోని తాడిచర్ల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో రామిడి చాందిని 973 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 57 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 57 మంది(100శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరంలో 38 మందికి గాను 34 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో డీ స్వాతీ 947 మార్కులు, బైపీసీలో స్వప్న 794 మార్కులు సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీలో రామిడి సిరి చందన 456, రామడి అనూష 456 మార్కులతో కాలేజీ టాప్‌గా నిలిచిచారు. ఎడ్లపల్లి మోడల్‌స్కూల్‌లో ద్వితీయ సంవత్సరం సీఈసీ గ్రూప్ విద్యార్థినీ అనుముల వైష్ణవి 960 మార్కులు, ఎంపీసీ గ్రూప్‌లో నూకల స్వాతి 932 మార్కులు సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపల్‌లో మేనం శ్రీజ 460, ఈగ శిరిష 453, సీఈసీ గ్రూప్‌లో తోట అలేఖ్య 453 మార్కులు సాధించారు. మోడల్ కాలేజీలో ప్రథమ, ద్వితీయ సంవత్సంలో 109 మంది పరీక్షలు రాయగా 103 మంది విద్యార్థుల ఉత్తీర్ణ సాధించారు. మల్లారం కస్తూరిబా గాంధీ పాఠశాలలో ప్రథమ సంవత్సరం 27 మందికి గాను 23 మంది, ద్వితీయ సంవత్సరం 15 మందికి గాను 15 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లో ఎస్ నందినీ 904, ఎస్ అలేఖ్య 862, ప్రథమ సంవత్సరంలో హరిక 441, స్వాతీ 430 మార్కులు సాధించారు.

మహదేవపూర్‌లో...

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్స్‌పల్ నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం విభాగంలో ఎంపీసీ మహమ్మద్ సమీరా 429, బైపీసీలో మహమ్మద్ సువాయిబా 396, సితఈసీలో షేక్ అయేషా 381,హెచ్ఈసీలో కుమ్మరి రాజేందర్ 276, ఒకేషనల్ విభాగంలో ఎంపీహెచ్‌డబ్ల్యూలో జె.రవళి 482లు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ బొడ్డు నవనీత్ 854, బైపీసీలో పిట్టల సదాశివ్ 854, సీఈసీలో దెబ్బట అజయ్ 673,హెచ్ఈసీలో ఏ.విష్ణు 641, ఒకేషనల్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూలో పి.శ్రీమతి 936 మార్కులు సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సరం 117మందికి 40 మంది ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 107 మందిలో 55 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాళ్లపల్లి రాకేశ్ తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో కే.సంజన, వి అశ్విత, పి.స్వాతి, బైపీసీలో ఆర్.నేహ, నికిత, సీఈసీలో భవాని, ఎంపీపీ ద్వితీయ సంవత్సరంలో నికిత, సీహెచ్ అజయ్, కే శృతి, బీపీసీలో భువన కృతి, పి.సిరి, అఖిల, సీఈసీలో శ్రీనిజ, సబితా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని ప్రిన్స్‌పాల్ తెలిపారు.

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ పాఠశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 65 శాతం ద్వితీయ సంవత్సరంలోని విద్యార్థులు 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్స్‌పాల్ శ్రీదేవి తెలిపారు. అలాగే సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్స్‌పాల్ గొల్కొండ భిక్షపతి తెలిపారు. మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సరంలో 71 మందికి 56 , ద్వితీయ సంవత్సరంలో 74కు గాను 70 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్స్‌పాల్ రమేశ్ తెలిపారు. అలాగే కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రథమ సంవత్సరంలో 48 మందికి 42, ద్వితీయ సంవత్సరంలో42 మందికి 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్స్‌పాల్ సుమలత తెలిపారు.

టేకుమట్ల: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఓ స్వప్న తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో సౌమ్యశ్రీ,, శిరీషా 962, ఎంపీసీలో కీర్తన 913, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో వర్షిత 438, బైపీసీలో సాయిప్రియ 392 మార్కులు సాధించినట్లు తెలిపారు.

కాటారం: మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలకు చెందిన వి.అశ్విత ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 455 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. గిరిజన సంక్షేమ గురుకుల బాలిక కళాశాలకు చెందిన సుప్రియ ద్వితియ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 989 మార్కులు సాధించింది. దామెరకుంట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలకు చెందిన మల్లోజి అక్షర ద్వితియ సంవత్సరం బైపీసీ విభాగంలో 978 మార్కులు, ఉమాదేవి 961 మార్కులు సాధించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 33 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం ఇద్దరు మాత్రమే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరానికి చెందిన 22 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా ఇద్దరు ఉత్తీర్ణత సాధించారు.

మెరిట్ స్కాలర్‌షిప్ పెంపు

భూపాలపల్లి అర్బన్: ప్రవేశ పరీక్షలు, వివిధ కోర్సులలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న సింగరేణి కార్మికుల పిల్లలకు యాజమాన్యం అందించే మెరిట్ స్కాలర్‌షిప్‌ను పెంచినట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.10వేల నుంచి 16వేలకు పెంచినట్లు చెప్పారు. ప్రవేశ పరీక్షల్లో 2వేల ర్యాంకు నుంచి 8వేల వరకు పెంచినట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందన్నారు.

ఏఐటీయూసీ నాయకుల హర్షం

తమ పోరాట ఫలితంగానే యాజమాన్యం మెరిట్ స్కాలర్‌షిపును పెంచిందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరిమి రాజ్‌కుమార్ హర్షం వ్యక్తంచేశారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మికుల పిల్లలు ఉన్నత చదువుల్లో రాణిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తున్నట్లు తెలిపారు. దీనిని పెంచాలని పలుమార్లు సీఎండీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ విద్య సంవత్సరం నుంచి సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. నాయకులు రాంచందర్, సుధాకర్ రెడ్డి, చంద్రమౌళి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భూమిని పరిరక్షించుకోవాలి

కాటారం: భూమిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. వరల్డ్ ఎర్త్ డేను పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. భూమి ప్రాముఖ్యత, పరిరక్షణ, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధం, నీటిని పొదుపుగా వాడుకోవడం, విద్యుత్ ఆదా, కాలుష్యాన్ని నివారించడం లాంటి అంశాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలోని ప్రతీ చెట్టుకు దాని సాధారణ నామం, శాస్త్రీయ నామం, చెట్టు ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా క్యూఆర్ కోడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెట్టు ప్రాముఖ్యతను తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బూర రమేశ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉమారాణి, ఉపాధ్యాయులు గీత, ఈశ్వరి, నర్సయ్య, గడ్డం ఫణీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌లను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అక్రమ వసూళ్లను అరికట్టాలి

- బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు కిరణ్



మాట్లాడుతున్న కిరణ్

కాటారం: కాటారం మండలం మేడిపల్లి సమీపంలో జాతీయ రహదారి(353 సీ)పై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా నిర్వాహకులు వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. టోల్‌గేట్ ద్వారా రాకపోకలు సాగించే వాహనాలకు రెండు సార్లు టోల్ చార్జీలు కట్ అవుతున్నట్లు వాహనదారులు తెలపడంతో కిరణ్ మంగళవారం టోల్‌గేట్‌ను సందర్శించి మాట్లాడారు. టోల్‌గేట్ నుంచి వెళ్తున్న వాహనాల ఫాస్ట్ టాగ్ నుంచి ఒక ప్రయాణానికి ఒక సారి మాత్రమే కట్ అవాల్సి ఉండగా రెండు, మూడు సార్లు కట్ చేస్తున్నారని ఆరోపించారు. దీంతో టోల్‌గేట్ గుండా ప్రయానించే వాహనదారులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. అంతేకాకుండా మేయింటెన్స్‌లో భాగంగా రోడ్డును బాగుచేయించాల్సి ఉండగా టోల్‌గేట్ నిర్వాహకులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. టోల్‌గేట్ వద్ద కనీస సౌకర్యాలు లేవని అయినప్పటికి వాహనదారుల నుంచి టోల్ మాత్రం బాదుతున్నారని అన్నారు. నేషనల్ హైవే అధికారులు, కలెక్టర్ స్పందించి టోల్‌గేట్ నిర్వాహకుల అక్రమ వసూళ్లను నిలిపివేయడంతో పాటు రహదారి మరమ్మతు చర్యలకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కిరణ్ వెంట బీఆర్ఎస్ నాయకుడు రామిళ్ల రాజబాబు ఉన్నారు.

హనుమాన్ స్వాములకు అన్నప్రసాదం

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ రాజ్‌మహ్మద్ హనుమాన్ స్వాములకు మంగళవారం ఆలయంలో భిక్ష(అన్నప్రసాదం) ఏర్పాటు చేశారు. వారితో భోజనం చేసి మతాలు వేరైనా భావాలు ఒక్కటే అనే నినాదంతో ఆయన ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు ఆకుల రాజు, పిట్టల నాగరాజు, కోడెల నరేష్, పేరుమాండ్ల రాజు, కంచం అంజిత్, సదానందం, రాజు, వంశీ, ప్రసాద్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15నుంచి 26వరకు జరుగు సరస్వతి పుష్కరాల అభివృద్ధి పనులపై సమీక్ష జరిపేందుకు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్ బుధవారం ఉదయం రానున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఈఓ ఎస్.మహేష్‌లు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు సమీక్షను దేవస్థానం ఈఓ కార్యాలయంలో నిర్వహించి, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించనున్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులు హాజరుకావాలని తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



భూపాలపల్లి: నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో టాస్క్ సంస్థ నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్హతల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని అన్నారు. క్యూ ఆర్ కోడ్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు ఈ నెల 27వ తేదీన నిర్వహించే జాబ్ మేళా స్టాళ్లలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

రేగొండ: ఎండవేడి కారణంగా వడదెబ్బకు గురైన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని భాగిర్థిపేట క్రాస్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన పెరుబండ్ల మహేందర్ (38) మద్యానికి బానిసై మూడు నెలలుగా రేగొండ మండలంలోని భాగిర్థిపేటలోని తన చిన్నమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. సోమవారం బుద్దారం వెళుతుండగా భాగిర్థిపేట క్రాస్ వద్ద ఎండ దెబ్బ తగిలి చనిపోయాడు. మంగళవారం ఉదయం అటువైపుగా వెళ్లిన గ్రామస్తులలు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షాఖాన్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



కాటారం: మహాముత్తారం మండలం యత్నారం, సింగంపల్లి, ముకునూర్, బోర్లగూడెం గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్ కాటారం ఇన్‌చార్జ్ సీఐ కిష్టయ్య డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నాటుసారా నిర్మూలన ప్రత్యేక డ్రైవ్‌లో బాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు గుడుంబా స్థావరాలపై దాడి చేసినట్లు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. 24 లీటర్ల గుడుంబా, 1000 లీటర్ల చక్కెర పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈమేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది వెంకటరాజు, కోటేశ్వర్, విమల, సునీల్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



చిట్యాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి: చిన్నారికి పోషకాహారం తినిపిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని రంగాపురం, ఇస్సిపేట, మొగుళ్లపల్లి, కొరికిశాల, మొట్లపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ నర్సింగరావు, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, కాంగ్రెస్ నాయకులు తక్కళ్లపెల్లి రాజు, నడిగొటి రాము, ఆకుతోట కుమారస్వామి, రాజేశ్వర్‌రావు, లింగరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిర్వాహకులు సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో, నవాబుపేట గ్రామంలో కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్డీఓ నరేష్, పౌరసఫరాల అధికారి శ్రీనాథ్, డీఏం రాములు తహసీల్దార్ హేమ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, తిరుపతి పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి

భూపాలపల్లి: గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై అవగాహన పెంచుకొని పోషకాహార లోపం లేకుండా ఆహారం తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు పోషణ పథకాలు కీలకమన్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి మల్లీశ్వరి, సీడీపీఓ రాధిక, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫెర్రీ పాయింట్ల వద్ద నిరంతరం నిఘా

- కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



సూచనలు చేస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

పలిమెల: మావోయిస్టులు దాటడానికి అనుకూలంగా ఉన్న గోదావరి ఫెర్రీ పాయింట్ల వద్ద నిరంతరం నిఘా ఉండాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పోలీసులకు సూచించారు. మంగళవారం మహదేవ్‌పూర్ సీఐ రామచందర్‌రావుతో కలిసి ఆయన పలిమెల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్టేషన్‌కి సంబంధించిన రికార్డులను పరిశీలించి, సిబ్బంది చేస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి తీర ప్రాంత గ్రామాలైన మండలంలోని సర్వాయిపేట, దమ్మూరు, బూరుగుగూడెం, నీలంపల్లి, బండారి గూడెం, ముకునూర్ ఫెర్రీ పాయింట్ల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. విధి నిర్వహణలో జాగ్రత్తతో పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముకునూర్, పలిమెల గ్రామాల్లోని గుత్తికోయ గూడాల్లోని గుత్తికొయలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలిమెల ఎస్సై జె.రమేష్, సివిల్, టీఎస్పీ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రేగొండ: మండలంలోని గడిపల్లి గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు సముద్రాల సురేష్, తాండూరి నరేష్ ఆధ్వర్యంలో ఆలయంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద మంత్రోత్సవాల మధ్య కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన ఏడునూతుల అనసూయ రంగారెడ్డి దంపతులు కల్యాణానికి, భక్తులకు అన్నదానం కోసం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జిట్ట రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గంగుల రాజు, ప్రధాన కార్యదర్శి నామాల రమేశ్, కోశాధికారి గోగుల అశోక్ రెడ్డి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కోలేపాక భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గారెపల్లి రిజర్వాయర్ పనుల అడ్డగింత



పనులు అడ్డుకుంటున్న నిర్వాసిత రైతులు

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మండల కేంద్రంలో నిర్మిస్తున్న గారెపల్లి రిజర్వాయర్-2 పనులను మంగళవారం భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజర్వాయర్ నిర్మాణం కోసం కొన్నేళ్ల క్రితం అధికారులు తమ భూములు తీసుకున్నారని ఇప్పటి వరకు పరిహారం అందించలేదని ఆరోపించారు. భూములు కోల్పోయి, పరిహారం అందక జీవనోపాధి లేక తమ కుటుంబాలు రోడ్డున పడాల్సి దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం కోసం పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగిన పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. పరిహారం అందించేంత వరకు పనులు చేయనీయబోమని పనులు చేస్తున్న వాహనం ఎదుట కూర్చున్నారు. ప్రాజెక్ట్ డీఈఈ ఉపేందర్ నిర్వాసిత రైతుల వద్దకు వెళ్లి నచ్చజెప్పడానికి ప్రయత్నించినప్పటికీ వారు వినలేదు. పరిహారం చెల్లించాకే పనులు చేసుకోవాలని రైతులు స్పష్టం చేశారు. పనులు అడ్డుకున్నవారిలో నిర్వాసితు రైతులు తైనేని సతీశ్, బౌతు సత్యం, దుర్గం రాజయ్య, గజ్జెల లింగయ్య, తదితరులు ఉన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

కాటారం: సబ్ డివిజన్ పరిధిలోని చెరువులు, కుంటల్లో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డికి మంగళవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, బీఎస్పీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి బొడ్డు రాజ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. మండలంలోని పోతులవాయి, నల్లగుంట, విలాసాగర్, శంకరాంపల్లి, దేవరాంపల్లి, పరికిపల్లి చెరువుల నుంచి నిత్యం మట్టి రవాణా యథేచ్ఛగా కొనసాగుతుందని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు సుమారు రూ.మూడు కోట్ల విలువైన మట్టిని అక్రమ రవాణాదారులు తరలించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. చెరువుల పరిరక్షణ నిబంధనలు ఉల్లంఘించి మట్టిని దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.